తెల్ల బంగారం ధర పెరిగేనా..?

- పత్తిని ఇళ్లల్లోనే నిల్వచేస్తున్న రైతులు
- ప్రస్తుతం క్వింటాల్ పత్తికి రూ.7వేలే
- ధర పెరుగుదలపై రైతుల ఎదురుచూపు
- తగ్గుతుండటంతో ఆందోళన


రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

ఎలిగేడు: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి(తెల్లబంగారం)కి ఆశించిన ధర లేకపోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. సరైన ధర లేక పత్తిని తమ ఇళ్లలోనే నిల్వ చేస్తున్నారు. ధర పెరుగుతుందని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. రోజు రోజుకు పతనమవుతున్న ధరలతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో పత్తి రేటు రూ.8 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.7500 నుండి 7800 వరకు పలుకుతోంది. గతేడాది క్వింటాలుకు రూ. 10 వేల వరకు పలికింది.

7500 క్వింటాళ్ల దిగుబడి అంచనా...

ఎలిగేడు మండలంలోని వానకాలం సీజన్‌లో రైతులు 868 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా 7500 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. సాధారణంగా ఎకరానికి 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు వస్తుంది. ఈసారి ధర పెరుగుతుందని పలువురు రైతులు పత్తిని విక్రయించడం లేదు. ఇప్పటికే రెండు, మూడు దఫాలుగా ఏరిన పత్తిని రైతులు తమ ఇళ్లల్లోనే నిల్వ చేసుకుంటున్నారు. అయితే గత అక్టోబర్‌లో క్వింటాలుకు రూ.7500 నుంచి మొదలై నవంబర్‌లో రూ.9 వేల వరకు ధర చెల్లించారు. ప్రసుత్తం రూ. 7500 వరకు పలుకుతోంది. ధర పతనం చూసి నవంబర్‌లో అమ్ముకుంటే ఎంతో కొంత లాభపడే వారమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టిన పెట్టుబడి రాని పరిస్థితి..

సిరులు కురిపిస్తుందనుకున్న తెల్లబంగారం (పత్తి) తమను నిలువునా ముంచుతుందని అనుకోలేదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగుకు ఎకరాకు సుమారుగా రూ. 40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుత ధర ప్రకారం పత్తిని విక్రయిస్తే పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదని లబోదిబోమంటున్నారు.

ధర లేక ఇంట్లోనే నిల్వ చేసిన..



నాలుగెకరాల్లో పత్తి పంటను పండించిన, ఇప్పటి వరకు నాలుగు సార్లు ఏరిన. నవంబర్‌లో 10 క్వింటాళ్ల పత్తి ఏరించిన అప్పుడు ధర రూ. 9వేలు ఉన్నప్పటికీ ఇంకా పెరుగుతుందని ఆశించి అమ్మలేదు. ధర పడిపోవడంతో 40 క్వింటాళ్ల పత్తి ఇంట్లోనే నిల్వ చేసిన.

– భూసారపు పరుశరాములుగౌడ్, పత్తి రైతు, ధూళికట్ట

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు



నాలుగెకరాల్లో పత్తి పంట సాగు చేశాను. పత్తిని 4 సార్లు ఏరిపించా, పత్తికి సరైన ధరలేకనే దాదాపు 30 క్వింటాళ్ల పత్తిని ఇంట్లోనే నిల్వ చేశాను. ధర తగ్గడంతో పెట్టుబడి ఎక్కువైంది. పంటకు పెట్టిన పెట్టుబడి రాని పరిస్థితి ఉంది. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలి.

– కొక్కిరాల దామోదర్‌రావు, పత్తి రైతు

కుర్సుకమ్మి పట్టాలు పంపిణీ చేసేందుకు కృషి

- ఎమ్మెల్యే కోరుకంటి చందర్


అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

రామగుండం: పెద్దంపేట, రాయదండి గ్రామాల శివారులోని కుర్సుకమ్మి భూములకు పట్టాలు పంపిణీ చేసేంతవరకు విశ్రమించేది లేదని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం పెద్దంపేటలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. 60 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పాలకులకు పట్టాలు పంపిణీ చేసేందుకు ఎందుకు చేతకాలేదని ప్రశ్నించారు. పట్టాల పంపిణీపై సీఎస్ శాంతకుమారి దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్సుకమ్మి భూములపై అవగాహన రాహిత్యంతో మాట్లాడుతూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యను త్వరలోనే పరిష్కంచరించేందుకు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం బ్రాహ్మణపల్లి రైతు వేదికలో 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీపీ దుర్గం విజయ, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోతు తిరుపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన కొమ్మాకుల రాకేశ్(25)మద్యానికి బానిసై సోమవారం ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజవర్ధన్ తెలిపారు. రాకేశ్ తండ్రి లక్ష్మయ్య చిన్నప్పుడే మృతి చెందగా అమ్మమ్మ కనుకమ్మ, తల్లి రాజేశ్వరి పెంచి పెద్ద చేశారు. తాగుడుకు బానిసైన రాకేశ్‌ను తల్లి, అమ్మమ్మ తాగితే ఆరోగ్యం పాడైపోతుందని వారించారు. తల్లి కూలిపనికి వెళ్లిన సమయంలో తాగి వచ్చి మద్యం మత్తులో ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని మృతి చెందినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. మృతుడి తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

మంథని: మండలంలోని పోతారం గ్రామానికి బిరుదు తిరుపతి(40) అనే వ్యక్తి రెండు రోజుల క్రితం గ్రామ సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపుతప్పి పడి పోయారు. స్థానికంగా చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీకాలేజీలో చేరాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

పెద్దపల్లిరూరల్: విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీకాలేజీలో చేరాలని పెద్దపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని మోడల్‌స్కూల్, జూనియర్ కాలేజీలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం ఉన్నతవిద్యను ఉచితంగా అందించేందుకు అన్ని వసతులను కల్పించిందన్నారు. పెద్దపల్లి కాలేజీలో అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ డ్రిల్ నందు, సీనియర్ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోండి


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

గోదావరిఖని: ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్‌పార్టీ నాయకులు మహంకాళి స్వామి, ఉమ్మెత్తుల దేవేందర్‌రెడ్డి, మేకల పోశం, ప్రతాప్‌రావు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమ ఇసుక రవాణాకు పర్మిషన్ ఇవ్వకుండా సాండ్ టాక్స్ ద్వారా ఇసుక రవాణా అయ్యేలా చూడాలని కోరారు. గత ఏడాది కాలంగా సాండ్‌టాక్స్ కాదని, అంతర్గాతం ఇసుక క్వారీద్వారా కొందరు రాత్రి సమయాల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. దీనికి అధికారులు సహకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఓదెల:క్రికెట్ క్రీడాకారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓదెలలో సీఎం కేసీఆర్ క్రికెట్ కప్ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలుగా చేయూతనిస్తుందన్నారు. క్రీడాకారులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె రమేశ్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎలిగేడు: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ తానిపర్తి స్రవంతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

కాన్షీరాం విగ్రహావిష్కరణకు ఆహ్వానం


చైర్‌పర్సన్‌కు ఆహ్వానపత్రం అందిస్తున్న సురేందర్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జెండాకూడలి వద్ద ఏర్పాటు చేసిన కాన్షీరాం విగ్రహావిష్కరణకు రావాలని కోరుతూ సోమవారం తొలి ఆహ్వాన పత్రికను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డికి అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు సురేందర్ సన్నీ అందించారు. విగ్రహావిష్కరణకు కాన్షీరాం కుటుంబీకులు హాజరవుతున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నడిపించాలని చైర్మన్ ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసరెడ్డి, మేనేజర్ శివప్రసాద్, టీపీవో అభినవ్, ఏఈ సతీష్ ఉన్నారు.

జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక


ఎంపిక పత్రం అందుకుంటున్న సంతోష్

మంథని: బహుజన సాహిత్య అకాడమీ సౌత్ ఇండియా రైటర్స్ నేషనల్ ఆరో కాన్ఫరెన్స్‌లో భాగంగా మంథని మండలం గుంజపడుగుకు చెందిన కాసిపేట సంతోష్ మహాత్మా జ్యోతిబాపూలే జాతీయ అవార్డుకు ఎంపికయ్యాడు. సంతోష్‌ను మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అడిషనల్ కలెక్టర్ గౌతి అభినందించారు.

సీఎస్‌ఐ చర్చిలో మైత్రి సహవాస కూడిక వేడుకలు


మాట్లాడుతున్న ప్రసిల్లా పరిమళ రూబెన్

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీ లోని సీఎస్‌ఐ సెయింట్ జాన్స్ చర్చిలో సోమవారం స్త్రీల మైత్రి సహవాస కూడికను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆరు జిల్లాల అధ్యక్షురాలు చీఫ్ రెవరెండ్ కే ప్రసిల్లా పరిమళ రూబెన్ ముఖ్య అతిథిగా హాజరై కుటుంబంలో స్త్రీల పాత్రపై క్రైస్తవ సోదరీమణులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహిళలు, చిన్నారులు నిర్వహించిన ప్రత్యేక కీర్తనలు, నాటికలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో గ్రూప్ చైర్మన్ రెవరెండ్ లక్ష్మణ్ జాకబ్, ఎం సుందర్, వరలక్ష్మీ, శిల్పా, సరిత, కమిటి పెద్దలు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గోదావరిఖని: జనగామ గ్రామంలో అతి పురాతనమైన శ్రీత్రిలింగ రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో మహాశివరాత్రి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాశివరాత్రి సందర్భంగా కల్యాణం, రథోత్సవం ఘనంగా జరుగుతుందని, గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి జాగరణ చేయడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. కార్పొరేటర్లు జనగామ కవితాసరోజని, దాతు శ్రీనివాస్, వేగలపు శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు జనగామ నర్సయ్య, తోకల రమేశ్, ఆడబత్తుల మల్లేశం, బొడ్డు చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవాలకు శ్రీ షిర్డీసాయి ఆలయం ముస్తాబు


చండీయాగం కోసం వేస్తున్న చలువ పందిళ్లు

రామగుండం: రైల్వేస్టేషన్ ఏరియాలోని శ్రీషిరీసాయి ఆలయ 27వ వార్షికోత్సవ (సప్తవింశతి) వేడుకలకు సర్వం సిద్ధమైంది. మంగళవారం వేకువజాము నుంచి ప్రారంభమయ్యే వేడుకలు బుధ, గురువారాలు కొనసాగనున్నాయని ఆలయ కమిటీ ప్రతినిధి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీ చివరి రోజు 108 మంది పుణ్యదంపతులతో చండీ యాగం నిర్వహణకు చలువ పందిళ్లు, భక్తులకు మౌళిక వసతుల కల్పన చర్యలు పూర్తయ్యాయన్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సాకేత్

కమాన్‌పూర్: జిల్లాలోని ప్రభుత్వ గురుకుల, పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని కోరుతూ జిల్లా బీసీ యువజన సంఘం ప్రధాన కార్యదర్శి ఇజ్జగిరి సాకేత్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ కళాశాలల యాజామాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూల్ చేస్తున్నారని వెంటనే అరికట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఉపసర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం


తీర్మాన కాపీ అందిస్తున్న వార్డు సభ్యులు

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా గ్రామ ఉప సర్పంచ్ బదావత్ జ్యోతిపై అవిశ్వాసం ప్రకటిస్తూ సోమవారం వార్డు సభ్యులు జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు తీర్మానం కాపీ అందజేశారు. గ్రామంలో మొత్తం 8 మంది వార్డుసభ్యులకు గాను ఆరుగురు వార్డుసభ్యులు ఇస్లావత్ శ్యామూల్, బదావత్ శారద, బానోత్ జైపాల్, ఇస్లావత్ తిరుపతి, ఇస్లావత్ రాజు, మూడ్ సమ్మక్క ఉప సర్పంచ్‌పై తమకు విశ్వాసం లేదని అడిషనల్ కలెక్టర్‌ను కలిసి తీర్మానం కాపీ అందజేశారు.

శాసన మండలి చీఫ్‌విప్‌ను కలిసిన నాయకులు


భానుప్రసాదరావుతో నాయకులు

ఎలిగేడు: శాసనమండలి చీఫ్ విప్‌గా నియమితులైన తానిపర్తి భానుప్రసాదరావును సోమవారం హైదరాబాద్‌లో జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, ఎలిగేడు సింగిల్‌విండో చైర్మెన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ కొక్కిరాల మహేశ్వర్‌రావు, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ. ఖలీల్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భానుప్రసాదరావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదువులు చేపట్టాలని ఆకాంక్షించారు.

ఎంపీవోకు సర్పంచుల సన్మానం


ఎంపీవోను సన్మానిస్తున్న సర్పంచ్‌లు

కమాన్‌పూర్: మండల పంచాయతీ అధికారిగా విధుల్లో చేరిన శేషయ్య సూరిని మండలంలోని సర్పంచ్‌లు సోమవారం శాలువాలతో సన్మానించారు. ఇక్కడ పని ఎంపీవోగా పని చేసిన ఆరీఫ్ హుసేన్ మంథనికి బదిలీ కాగా, మంథనిలో ఎంపీవోగా పని చేస్తున్న శేషయ్య సూరిని కమాన్‌పూర్‌కు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బొల్లపెల్లి శంకర్ గౌడ్, సర్పంచ్‌లు ఆకుల ఓదెలు, కొండ వెంకటేశ్, ఇటవేన కొమురమ్మ, నీలం సరిత, అన్నపూర్ణ, నాయకులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

జూలపల్లి: మండలంలోని బాల్‌రాజ్‌పల్లిలో రూ.5లక్షలతో చేపట్టే సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంటూరి రాజయ్య, ఉపసర్పంచ్ అడువాల తిరుపతి, వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇది క్రీడా ప్రాంగణమేనా..?


బోంతకుంటపల్లిలోని క్రీడాప్రాంగణం

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో క్రీడాకారుల ప్రతిభ వెలికి తీసేందుకు ఏర్పాటు చేస్తున్న గ్రామీణ క్రీడా ప్రాంగణాలు పనికి రావడం లేదు. స్థలం కొరత, ఉన్నతాధికారుల ఒత్తిడితో ప్రజాప్రతినిధులు తూతు మంత్రంగా ఏర్పాటు చేశారు. ఆటస్థలం లేకున్నా బోర్డులతో ఏర్పాటు చేయడంతో అధికారుల, ప్రజాప్రతినిధుల పనితీరు కనబడుతోంది. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం తప్ప క్రీడలకు పనికి రాకుండా పోతున్నాయి. దీనికి నిదర్శనమే సుల్తానాబాద్ మండలం బోంతకుంటపల్లిలో ఏర్పాట చేసిన క్రీడాప్రాంగణం. ఆట స్థలం లేకపోయినా బోర్డు ఏర్పాటు చేశారు.

రహదారిపై విద్యుత్ స్తంభాలు తొలగించాలని నిరసన


స్తంభం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

కోల్‌సిటీ: గోదావరిఖని గాంధీనగర్‌లోని కోర్టు ఎదుట ప్రధాన రహదారి మధ్యలో నిర్లక్ష్యంగా వదిలేసిన విద్యుత్ స్తంభాలను తొలగించాలని డీవైఎఫ్ఐ నాయకులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొంటు సాగర్ మాట్లాడుతూ... గాంధీనగర్‌లోని సివిల్ జడ్జి కోర్టు ముందు ప్రధాన రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉందని, 100 ఫీట్ల రోడ్డు విస్తరణ పనుల్లో రహదారిపై భారీ వృక్షాలను తొలగించిన అధికారులు, విద్యుత్ స్తంభాలను మాత్రం తొలగించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని, రాత్రివేళల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, హెచ్చరికల బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలను తొలగించాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్లు చంద్రగిరి కృష్ణకుమార్, కోకన్వీనర్ మొగిలిచర్ల సురేశ్ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమంపై బీఆర్ఎస్ సర్కార్‌కు శ్రద్ధ లేదు


రిలే దీక్షాశిబిరంలో సంతకం చేస్తున్న విశ్వం

పెద్దపల్లిరూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల సంక్షేమంపై దృష్టిసారించడం లేదని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఉరుమల్ల విశ్వం అన్నారు. పెద్దపల్లిలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు సోమవారం 19వ రోజుకు చేరాయి. జనాభాలో అధికశాతం ఉన్న బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. బీసీ జనగణన చేపట్టాలని, జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కాంత, మధు, శారద, అఖిల, రవి, శ్రీధర్, సురేశ్, షమీముద్దీన్, అజయ్ తదితరులున్నారు.

ఒప్పుకున్న డబ్బు ఇవ్వాలని ఆందోళన


ఆందోళనకు దిగిన బాధిత కుటుంబ సభ్యులు

ఎలిగేడు: పరిహారంగా ఇస్తామన్న డబ్బులు ఆర్నెళ్లయినా చెల్లించడం లేదంటూ బాధిత కుటుంబం ఆందోళనకు దిగింది. వారి కథనం ప్రకారం.. ఎలిగేడు మండలం బుర్హాన్‌మియాపేటకు చెందిన దుబాసి శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హార్వెస్టర్‌కు డ్రైవర్‌గా పనిచేసేవాడు. పదినెలల క్రితం హార్వెస్టర్ నడుపుతూనే మంథనిలో గుండెపోటుతో చనిపోయాడు. దీంతో యజమాని శ్రీనివాస్ కుటుంబానికి రూ.9లక్షలు ఇవ్వడానికి అంగీకరించి రూ.2.50లక్షలు అందించాడు. మిగిలిన డబ్బులు ఆర్నెళ్లలోపు ఇస్తానని బాండ్‌పేపర్ రాసిచ్చాడు. పదినెలలు గడిచినా ఇవ్వకపోవడంతో శ్రీనివాస్ భార్య సౌందర్య పిల్లలతో కలిసి యజమాని ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఆమెకు మహిళా సంఘాలు అండగా నిలిచాయి. ఎండలోనే ఉండడంతో సౌందర్య అపస్మారక స్థితికి వెళ్లింది. వైద్యుడిని పిలిపించి ఆమెకు ప్రాథమిక చికిత్స అందించారు. జూలపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఫిర్యాదు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


పాలకుర్తిలో కంటిపరీక్షలు చేసుకుంటున్న సర్పంచ్

ధర్మారం: మండలంలోని న్యూ కొత్తపల్లిలో సోమవారం కంటి వెలుగు ఉచితవైద్య శిబిరాన్ని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, ఎంపీడీవో జయశీల, ఎంపీవో రమేష్, వైద్యాధికారి గౌతం, సర్పంచ్, ఎంపీటీసీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎలిగేడు: మండలలలోని నారాయణపల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్యశిబింలో సోమవారం 130మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 10మందికి కంటి అద్దాలను అందజేసినట్లు మెడికల్ ఆఫీసర్ నిస్సీక్రిస్టీనా తెలిపారు

పాలకుర్తి: మండల కేంద్రంలో కంటివెలుగు వైద్య శిబిరాన్ని సోమవారం సర్పంచ్ దుర్గం జగన్ ప్రారంభించారు. కంటి వెలుగును ప్రజలు వినియోగించుకోవాలని, అవసరం ఉన్నవారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తారని సర్పంచ్ వివరించారు.

ఓదెల:కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కునారపు రేణుకదేవి అన్నారు. మండలంలోని గోపరపల్లెలో సోమవారం కంటివెలుగు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచు కర్క మల్లారెడ్డి, ఎంపీటీసీ గోపు లావణ్య, ఎంపీడీవో జి సత్తయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం చిన్న కల్వలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీఓ శశికళతో కలిసి ఎంపీపీ బాలాజీరావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ సంపత్‌గౌడ్, తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఓబీసీ ప్రధాన కార్యదర్శిగా రాజు

మంథని: మంథని మండలం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ ప్రధాన కార్యదర్శిగా బోయిన్‌పేటకు చెందిన గుండా రాజును ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు గోటికార్ కిషన్ నియమించాడు. సోమవారం ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

ముత్తారం మండల అధ్యక్షుడిగా కుమారస్వామి..

రామగిరి: ముత్తారం మండలం ఖమ్మంపల్లికి చెందిన అల్లం కుమారస్వామి కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమితులైయ్యారు. ఈమేరకు సోమవారం ఏఐసీసీ కార్యదర్శి, మాజీ మంత్రి, మంథని శాసనసభ్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కుమారస్వామికి నియామకపు పత్రాన్ని అందించారు. తనపై నమ్మకంతో నా నియామకానికి సహకరించిన నాయకులకు కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దెల రాజయ్య, సీనియర్ నాయకుడు లక్కెం ప్రభాకర్ పాల్గొన్నారు.

రామగుండం అధ్యక్షుడిగా సదానందం

రామగిరి: మండలంలోని లద్నాపూర్‌కు చెందిన బండారి సదానందంను కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల అధ్యక్షునిగా నియమిస్తూ ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు సోమవారం సదానందంకు నియామకపు పత్రం అందించారు.